క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి విరాళం



ఈఓ జయకుమార్‌కు విరాళం అందజేస్తున్న దాత గౌతమ్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన కుంటుమల్ల గౌతమ్ ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని మబ్బు దేవనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ ఎ.జయకుమార్‌కు అందించారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

చంద్రగిరి: ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆదివారం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలను విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేశారు. అనంతరం వాటిని ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచి, సీలు వేశారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు చేపట్టారు. అనంతరం పరీక్ష ప్రశ్నపత్రాలను స్టేషన్‌లో భద్రపరిచారు.

విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

పాకాల : మండలంలోని మొగరాల గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ మొగరాల, కృష్ణాపురం, చల్లావారిపల్లి, రమణయ్యగారిపల్లి, తోటతిమ్మయ్యగారిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ ఉపకేంద్రం చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈలు బాలాజీ, చిన్నరెడ్డెప్పరెడ్డి, డీఈలు జీవన్‌కుమార్, భాస్కర్‌నాయుడు, ఏఈలు ఎం.హరిప్రసాద్, రవిచంద్రబాబు, స్థానిక నాయకులు సిద్ధయ్యనాయుడు, మధు నాయుడు, శ్రీనివాసులు, ఆనంద్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.


క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎంపిక



రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న వస్త్ర వ్యాపారులు

తిరుపతి కల్చరల్: తిరుపతి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడడిగా కిట్టు ఖాది బండార్ అధినేత రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం కరకంబాడి రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను అసోసియేషన్ నేతలు, వ్యాపారులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అభివృద్ధితో పాటు, వ్యాపారుల సంక్షేమంపై నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అలాగే అసోసియేషన్ భవన నిర్మాణానికి ఈ సందర్భంగా ఆయన రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. అలాగే పలువురు వస్త్ర వ్యాపారులు కూడా తమవంతు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఆర్ఎస్.రామిరెడ్డి, రామ్‌గోపాల్, విద్యాసాగర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, అజయ్‌రెడ్డి, ప్రకాష్ బచ్చు, ప్రభాకర్, వీరభద్ర రావు, రాజారెడ్డి, ప్రదీప్, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కేంద్ర సహాయ మంత్రి



ఆలయం వెలుపల కేంద్ర సహాయ మంత్రి భఘేల్

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని కేంద్ర మత్స్యశాఖ సహాయమంత్రి ఎస్.పి.సింగ్ భఘేల్ దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించి వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వేతన వేదన



ప్రతి నెలా ఒకటో తారీఖు కోసం వేతన జీవులు ఎదురు చూస్తుంటారు. ఖాతాలో నగదు జమ కాగానే కుటుంబ అవసరాలను తీర్చుకుంటారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కొన్ని శాఖల ఉద్యోగులు విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి ఏడాదిగా వేతనాలు రాకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఫైనాన్స్ అప్రూవల్ లేదంటూ అధికారులు చేతులెత్తేయడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రుయా ఉద్యోగులు సైతం ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.

- జీతాల కోసం ఐసీడీఎస్ సిబ్బంది ఎదురుచూపు
- ఫైనాన్స్ అప్రూవల్ లేదంటూ ఏడాదిగా కాలయాపన
- కనిపించని జీతాల ఫైల్
- కనిపించడం లేదని చేతులెత్తేసిన ఆ శాఖ ఉన్నతాధికారులు
- నానా అవస్థలు పడుతున్న ఉద్యోగులు
- రుయా ఆస్పత్రిలోనూ ఇదే పరిస్థితి

తిరుపతి తుడా : ఐసీడీఎస్ తిరుపతి శాఖ కార్యాలయంలో పనిచేసే 8 మంది ఉద్యోగులు ఏడాది నుంచి జీతాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. గత ఏడాది మార్చి వరకు సకాలంలో వేతనాలు అందాయి. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఒక్క నెల కూడా జీతాలు అందకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. వీరి సమస్యలు పరిష్కరించే వారే కరువయ్యారు. వేతనాలు మంజూరు చేయించడంపై దృష్టి సాధించాల్సిన ఉన్నతాధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు జీతాలు రాక ఇంటి అద్దెలు, కుటుంబం నడపడం, పిల్లల చదువులు, ఈఎంఐల చెల్లింపులకు నానా అవస్థలు పడుతున్నారు.

ఫైల్ ఎక్కడుందో..?

ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన ఫైల్ కనిపించడం లేదంటూ విజయవాడలోని ఆ శాఖ ఉన్నతాధికారులు చేతులు దులిపేసుకున్నారు. దీనిపై ప్రశ్నిస్తే మీ ఫైల్ అక్కడ ఉంది.. ఇక్కడ ఉంది అంటూ కాలయాపన చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. విజయవాడలోని ఐసీడీఎస్ రాష్ట్ర కార్యాలయ అధికారుల నిర్లక్ష్యపు తీరుతో ఏడాది నుంచి వేతనాల ఫైల్ ముందుకు కదలడం లేదు. ఫైనాన్స్ అప్రూవల్ కోసం ఫైల్ వెళ్లిందని తెలుసుకున్న ఉద్యోగులు అక్కడికి వెళ్లి ఆరా తీయగా.. మీ ఫైల్ ఇక్కడ లేదని చెబుతుండడంతో ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అనుమతుల కోసం వెళ్లిన ఫైల్‌ను వెతికించేదెవరు? అప్రూవల్ చేయించే వారెవరు? తమకు వేతనాలు మంజూరు చేయించే వారెవరు? దేవుడా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆ శాఖ అధికారిని వివరణ కోరగా..విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో సమస్య ఉందని, ఎస్ఎంఎస్ పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు విన్నవించినట్లు వెల్లడించారు.

రుయాలో ఇదే తీరు

తిరుపతి రుయా ఆస్పత్రిలో పనిచేసే శాశ్వత, ఔట్ సోర్సింగ్, ఇతర సిబ్బంది వేతనాలు ఆగిపోయాయి. ఇక్కడి ఉద్యోగుల వేతనాల వ్యవహారం ఇదివరకు రుయా అదనపు డైరెక్టర్ పరిధిలో ఉండేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇక్కడి ఉద్యోగుల జీతాల వ్యవహారాన్ని ఎస్వీ మెడికల్ కళాశాల ఏడీ పరిధిలోకి చేర్చింది. దీంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వీటిని పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో మరో రెండు మూడు నెలల పాటు రుయా ఉద్యోగులకు వేతనాలు అందే పరిస్థితి కనిపించడం లేదు.

వారపు సంతలో వ్యాపారుల చేతివాటం


చంద్రగిరి: వారపు సంతలో నిత్యావసరాల కోసం వస్తున్న వినియోగదారులను పలువురు వ్యాపారస్తులు బురిడీ కొట్టిస్తున్నారు. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలను కొనుగోలు చేసే క్రమంలో వ్యాపారస్తులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లుగా వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఆదివారం నిత్యావసరాలు కొనుగోలు చేసే క్రమంలో తూనికల్లో భారీగా తేడాలు వస్తున్నట్లుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1.5 కిలోల ఎర్రగడ్డలు కొనుగోలు చేస్తే 1.200 కిలోలు మాత్రమే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 3 కిలోల కూరగాయలను కొనుగోలు చేస్తే 2.75 కిలోలే వస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లో అధిక ధరలు, హైబ్రిడ్ వస్తువులు ఉంటాయని, సంతలో ఆర్గానిక్ వస్తువులే ఉంటాయనే ఉద్దేశంతో వస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. అయితే అధిక మొత్తంలో వ్యాపారస్తులు ఇలా తూనికలలో మోసం చేయడం తగదంటూ వాపోతున్నారు. వారపు సంతలో జరుగుతున్న మోసాలపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేయనున్నట్లు తెలుస్తోంది. తూనికల మోసాలపై అధికారులు విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చంద్రగిరి వారపు సంతలో నిత్యావసరాల కొనుగోలుకు తరలివచ్చిన ప్రజలు

మూగబోయిన గరిమెళ్ల గానం

- టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణ ప్రసాద్ మృతి
- శ్రీవారి వైభవాన్ని నలుమూలలా చాటిన గొప్ప గాయకుడు
- లక్షలాది మంది అభిమానులు ఆయన సొంతం
- కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న వాగ్గేయకారుడు
- సంతాపం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు, టీటీడీ అధికారులు



తిరుపతి కల్చరల్: ప్రముఖ వాగ్గేయకారుడు, శ్రీవారి పరమభక్తుడు అన్నమాచార్య సంకీర్తనా మహతిగా శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తంగా చేసిన మహానుభావుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఆదివారం సాయంత్రం 5.20 గంటలకు మృతి చెందారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు మొదటితరం విద్వాంసుల్లో అగ్రగణ్యుడిగా పేరు గడించిన ఆయన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. అన్నమాచార్య సంకీర్తనా మహతి బిరుదును అందుకున్న ఆయన సుమారు ఆరువందలకు పైగా అన్నమాచార్య సంకీర్తనలను స్వరపరిచి వాటిని బహుళ ప్రచారంలోకి తీసుకురావడానికి తుదిశ్వాస విడిచే వరకు కృషి చేశారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి స్వయాన అక్క కొడుకు కావడం సంగీత కుటుంబ నేపథ్యంలో ఆయన జీవితం పరిమళించింది. రాజమండ్రిలో 1948 నవంబర్ 9వ తేదీన కృష్ణవేణి, నరసింహారావు దంపతులకు ఆయన జన్మించారు. ఆయన తండ్రి గరిమెళ్ల నరసింహారావు ప్రముఖ మృదంగ విద్వాంసుడు, వాగ్గేయకారుడు. 1976లో సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టీటీడీలో అన్నమాచార్య ప్రాజెక్టులో స్కాలర్‌షిప్ కోర్సుకు ఎన్నికై అదే ప్రాజెక్టులో నిలయ విద్వాంసుడిగా అన్నమాచార్య సంకీర్తనలను ప్రచారం చేస్తూ శ్రీవారి వైభవాన్ని ప్రచారం చేసిన ధన్యజీవి. ప్రపంచవ్యాప్తంగా బాలకృష్ణప్రసాద్ స్వరపరిచిన సంకీర్తనలను ఆలపిస్తున్న ఏకలవ్య శిష్యులు ఎందరో. పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు, జగడపు చనవుల జాతర, తిరువీధుల మెరసీ దేవదేవుడు, సందెకాడ పుట్టినట్టి ఛాయల పంట, ఇతడొకడే సర్వేశ్వరుడు, నమో నారాయణ నమో, పరమపురుషుడు, జయజయకృతి మణిమాల, నవగ్రహాది కృతిమణిమాల, గణేశ కృతి మణిమాల వంటి గ్రంథాలతో పాటు అనేక లలిత గీతాలను కూడా రచించారు. సామవేదం, షణ్ముగ శర్మ రచించిన శివపదమ్ గీతాలను స్వరపరిచి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. అమెరికా, లండన్ వంటి దేశాల్లో సంగీత కచేరీలు నిర్వహించి తన సుమధుర గానంతో వేలాదిమంది అభిమానులను శిష్యులుగా చేసుకున్న ఆదర్శమూర్తి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్.

ప్రముఖుల సంతాపం

టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఆకస్మిక మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ చీఫ్ పీఆర్ఓ టి.రవి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తిరుపతి జిల్లా రచయిత సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, గంగాధరప్రసాద్ సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ ఉన్నతాధికారులు, అన్నమాచార్య ప్రాజెక్టు నిలయ విద్వాంసులు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపక బృందం, ఘంటసాల గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకుమార్‌రెడ్డి, కార్యదర్శి ఉదయ భాస్కర్‌రెడ్డి, నగరానికి చెందిన కళాకారులు, అభిమానులు నివాళులు అర్పించారు.

గరిమెళ్ల మృతికి చెవిరెడ్డి సంతాపం

తిరుపతి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి తన మనసును కలచి వేసిందని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిమెళ్ల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీవారికి పరమ భక్తుడైన అన్నమయ్య రచించిన సంకీర్తనల్లో ఆరువందలకు పైగా సంకీర్తనలను భక్తులకు వినసొంపుగా స్వరపరచి స్వామివారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసిన గొప్ప గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అని కొనియాడారు. గరిమెళ్ల మృతి శ్రీవారి భక్తులకే కాకుండా సంగీత ప్రియులు అందరికీ తీరని లోటు అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేసిన వైద్యబృందం

తిరుపతి తుడా: బెంగళూరు, చెన్నై, హైదరాబాదు లాంటి మెట్రో నగరాలకు ధీటుగా శ్రీ మారుతి హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారుతీ కృష్ణ తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీ మారుతి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో 37 సంవత్సరాల మహిళకు అరుదైన ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మారుతీ కృష్ణ మాట్లాడుతూ సదరు మహిళకు ఆయాసంతో పాటు ఎడమ పక్కన ఊపిరితిత్తి పూర్తిగా మూసుకుపోవడంతో బెంగళూరు నుంచి తమ ఆస్పత్రికి రావడం జరిగిందన్నారు. ఈ మేరకు వైద్య పరీక్షలు నిర్వహించి ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ గడ్డ, అదేవిధంగా నీరు పేరుకుపోయి ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉన్నట్లు గమనించామన్నారు. వెంటనే ప్రముఖ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ పర్యవేక్షణలో వైద్యబృందంతో కలిసి బ్రోంకోస్కోపీ చేసి ఊపిరితిత్తులలోని క్యాన్సర్ గడ్డను తొలగించారన్నారు. ఎంతో క్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను ఇంటర్వెన్షనల్ పలమనాలజిస్ట్, సిటీ సర్జరీ విభాగం వారు విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నేతలు ఉదయం 9 గంటలకు సప్తగిరి నగర్‌లో ప్రజా సమస్యల సేకరణ
- యువత పోరుపై ఉదయం 9 గంటలకు పద్మావతి పురంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి మీడియా సమావేశం
- అన్యమతస్తుల దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన
- జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చెలికాని అన్నారావు భవన్‌లో ఉదయం 11 గంటలకు జాతీయ నూతన విద్యా విధానంపై జాతీయ సదస్సు
- మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్-2025లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 10 గంటలకు క్రికెట్ లీగ్ పోటీలు
- జాతీయ సంస్కృత వర్సిటీలో ఉదయం 10 గంటలకు జానపద విజ్ఞాన సదస్సు
- స్విమ్స్‌లోని పాత డైరెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు
- ఈతరం కవితా వేదిక ఆధ్వర్యంలో యూత్‌హాస్టల్లో ఉదయం 10 గంటలకు ×తమసోమా జ్యోతిర్గమయ₹ పుస్తకం ఆవిష్కరణ సభ
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో , తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల స్వీకరణ

నూతన కమిటీ ఎంపిక



బాలాజీ, కరీముల్లా , అమరనాథ్ రెడ్డి

తిరుపతి కల్చరల్: టూరిస్ట్ గైడ్స్ యూనియన్ ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసుబ్రమణ్యం, జయచంద్ర తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన యూనియన్ సభ్యుల సమావేశంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. యూనియన్ అధ్యక్షుడిగా బి.బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కరీముల్లా, ఉపాధ్యక్షులుగా పెద్దిరెడ్డి, సురేష్, హరి, నాగభూషణం, సహాయ కార్యదర్శులుగా రాము, మధు, హరి, చంద్రబాబు, కోశాధికారిగా అమరనాథ్‌రెడ్డితో పాటు 10 మంది కమిటీ సభ్యులను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా టూరిజం విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు లేకపోగా, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి వాటిని కూడా ప్రైవేటు యాజమాన్యాలు కల్పించడం లేదని తెలిపారు. వీరికి కనీసం భద్రత కూడా లేని వాపోయారు. వీరి సంక్షేమం కోసం భవిష్యత్‌లో ఉద్యమం చేపడతామని, ఆ దిశగా నూతన కమిటీ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



శిల్పారామంలో నాట్య ప్రదర్శన చేస్తున్న నృత్యకారులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో జరిగే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చెన్నైకి చెందిన ఎస్కే నాట్యకళానికేతన్ అకాడమీ బృందం వారు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గురువు కవితా శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి. పుష్పాంజలి, సలంగకత్తి, భాగద్యాలక్ష్మి, బ్రహ్మ ఒక్కటే, గరుడగమనే, మహాభారత శబ్దం, మల్లై మ్యాట్రినల్, ఆండాళ్ కొత్వం, మడుమైకంకన్నై, విష్ణు కొత్వం, మడుమైకుంకన్నై, విష్ణుకొత్వం, పర్కడల్, స్వాగతం కృష్ణ, అదివో అల్లదివో, కృష్ణర్ బజన్, రామ్ బజన్, ఆండాళ్ థిల్లానా వంటి భక్తి పాటలకు నృత్యం చేశారు. చెన్నైకి చెందిన కల్పశ్రీ నృత్యాలయం తరపున ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కల్పశ్రీ నృత్యాలయం సంస్థ ప్రతినిధులతో పాటు నాట్య ప్రదర్శన చేసిన నృత్యకారులు అందరినీ శిల్పారామం పరిపాలన అధికారి ఖాదర్‌వల్లీ సత్కరించారు.

12న యువత పోరు



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు

తిరుపతి కల్చరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే యువత పోరును జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దినేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలతో కలిసి యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్యను అందించాలన్న ఉద్దేశంతో గతంలో మహానేత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజురీయింబర్స్‌తో పాటు అనేక పథకాలు అందించారన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని పాలకులు జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని చెప్పిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయకపోవడం దగా చేయడమేనన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.4.600 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 12న చేపట్టే యువత పోరుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు జీవన్, సాయిరాకేష్, కిషోర్‌రెడ్డి, మణికంఠ, అమీర్, చిద్విలాస్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: తమ పిత్రార్జితంగా వచ్చిన సత్యవేడు మండలం ఆరూరు గ్రామం లెక్కదాఖలాలోని సర్వేనంబర్ 25లోని 13 ఎకరాల భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి తమకు అప్పగించాలని రైతు తేజోమయానంద విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో అప్పటి ప్రభుత్వం స్పెషల్ ఎకనామిక్ జోన్ సెజ్‌ల ఏర్పాటు కు ఆరూరు గ్రామ పరిధిలో భూసేకరణ చేపట్టారని తెలిపారు. రెవెన్యూ అధికారులు భూసేకరణ ద్వా రా తమ భూమిని కూడా ఇవ్వాలని కోరితే తాము తిరస్కరించామన్నారు. అయితే 2011లో తమ ప్రమేయం లేకుండా తనపేరిట ఉన్న భూమిని శ్రీసిటీ వారిపై అధికారులు ఆన్‌లైన్‌లో మార్పు చేశా రని వాపోయాడు. అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టులో కేసు వేశానని తెలిపారు. శ్రీసిటీ వారు దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించుకున్నా రని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, ప్రభు త్వ ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న బాధిత రైతు సురేష్ | మాట్లాడుతున్న బాధిత రైతు తేజోమయానంద

పరిహారం ఇప్పించండి

1940 నుంచి తమ అనుభవంలో ఉన్న 93.75 సెంట్ల భూమికి అధికారులు నష్టపరిహారం ఇవ్వలేదని, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆరూరు గ్రామ రైతు సురేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు కాకుండా వేరొకరికి పరిహారం ఇచ్చినట్లు అధికారులు రికార్డుల్లో సృష్టించారని ఆరోపించాడు. అధికారులు పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వంట పాత్రల వితరణ



బాలికల వసతి గృహానికి వంటపాత్రలు, సరుకులు వితరణ చేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జీవకోనలో రీల్స్ సంస్థ నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి ఆదివారం వంట పాత్రలు, స్టీల్ ప్లేట్లు, హాట్‌బాక్సులు, టవల్స్, నోట్‌బుక్స్, పెన్నులు, వంట సరుకులు వితరణ చేశారు. వీటిని వసతి గృహ నిర్వాహకుడు శాకం కృష్ణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశం, మునికృష్ణ, రాధాకృష్ణ, రాజగోపాలాచారి, జయలక్ష్మి, హరినాథ్, రాజా, గోపాల్, వెంకటరమణ, వసతి గృహం వార్డెన్ హేమావతి,ట్యూటర్స్ శైలజ, జ్యోతి పాల్గొన్నారు.

దొనకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలతో ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న సుధారెడ్డి

పాకాల : మండలంలోని కె.వడ్డేపల్లి పంచాయతీ అమ్మగారిపల్లిలో వెలసిన దొనకొండ గంగమ్మకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం ఆలయంలో వెంకటేష్, పాపమ్మ దంపతుల సహకారంతో ధ్వజస్తంభం కుంభాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు తీసుకొచ్చిన సుధారెడ్డికి ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజనాయుడు, సురేష్, సావిత్రి, బొల్లినేని మహేష్, రామ్మూర్తిరెడ్డి, శ్రీరాములు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయహో భారత్..



ఇండియా - న్యూజిలాండ్ మధ్యజరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా ఘన విజయం సాధించడంతో తిరుపతిలో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. - తిరుపతి క్రైం